పంటలు చేతికి వచ్చేనా..?

● అడుగంటుతున్న భూగర్భ జలాలు.. ఎండుతున్న పొలాలు
● చెత్తాచెదారంతో నిండిన కెనాళ్లు

నర్మెట: తెలంగాణలో మరెక్కడా లేని విధంగా మండలంలో నాలుగు రిజర్వాయర్లు ఉన్నా, సకాలంలో గోదావరి జలాలు అందక నీరు లేక పోవడం, సాగు నీరందించేందుకు నిర్మాణం చేపట్టిన కెనాళ్లు పూర్తిగా చెత్తాచెదారం, కలుపు మొక్కలు, తుంగతో నిండిపోవడంతో చెరువు కుంటలకు నీరందే పరిస్థితి లేదు. దీంతో భూగర్భజలాలు అడుగంటగా బోరుబావుల్లో నీరందక కంకి దశలో ఉన్న వరి, మొక్కజొన్న పంటలు చేతికందే దశలో రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. మల్లన్నగండి రిజర్వాయర్ 0.4 టీఎంసీ, ఆయకట్టు 4,000, బొమ్మకూర్ 0.15 టీఎంసీ, కుడి ఎడమ కాల్వల ద్వారా 31 వేల ఆయకట్టు, వెల్దండ 0.15 టీఎంసీ, ఆయకట్టు 12.5 వేలు, కన్నెబోయినగూడెం 0.2 టీఎంసీ , ఆయకట్టు 14 వేల ఎకరాలు. కాగా, గత నాలుగు రోజులుగా ఒక్క పైపులైన్ ద్వారా ధర్మసాగర్, మల్లన్నగండి నుంచి బొమ్మకూర్ రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీరు తపాస్‌పల్లికి పంపిస్తున్నారు. దీంతో మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉపాధిహామీ పథకంలో కెనాళ్లను శుభ్రంచేసి చెరువు, కుంటలు నింపి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


తుంగ, కలుపు మొక్కలతో నిండిన బొమ్మకూర్ కెనాల్


భూగర్భజలాలు అడుగంటడంతో బోరులో తగ్గిన నీరు

కాల్వల్లో చెత్తను తొలగించాలి



పంటలు చేతికి వస్తాయనుకుంటున్న సమయంలో నీరందక పోవడంతో ఎండిపోయే పరిస్థితి వచ్చింది. లక్షల్లో పెట్టుబడి పెట్టాను. కాల్వల్లోని చెత్తను తొలగించి చెరువు కుంటను నింపితేగాని మాకు బతుకు లేదు. కనీసం కరువు పనితోనైనా చెత్తను తొలగిస్తే బాగుంటుంది.

– నక్కల రవి, రైతు, నర్మెట

నీటిపారుదల శాఖ ఎన్‌ఓసీ ఇవ్వాలి

ఓపెన్ కెనాళ్లు పూర్తిగా చెత్త, కలుపు మొక్కలతో నిండాయి. రైతుల నుంచి కూడా వినతులు బాగావస్తున్నాయి. ఉపాధిహామీలో పనులు చేయించడానికి మేము సిద్ధమే. కాని నీటిపారుదలశాఖ అనుమతులు (ఎన్‌ఓసీ) తప్పని సరి. అధికారులు అనుమతిస్తే శుభ్రం చేయిస్తాం.

– బి.రమాదేవి, ఏపీఓ, ఎన్‌ఆర్ ఈజీఎస్

క్లుప్తంగా

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



జనగామ రూరల్: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన తెలుగు సంవత్సరాది క్యాలెండర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఉపేందర్, నాగరాజు, దయాకర్, సమ్మద్, సందీప్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాలచక్ర పంచాంగం..

పట్టణ స్వర్ణకార సంఘం భవనంలో విశ్వబ్రాహ్మణ సిద్ధాంతి రాళ్లబండి లంకేశ్వరాచార్యులు రూపొందించిన నూతన స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగం శుక్రవారం జిల్లా అధ్యక్షుడు నారోజు రామేశ్వరాచార్యులు ఆవిష్కరించారు. జక్కోజు శ్రీనివాస్, వల బోజుచక్రపాణి, ఆంజనేయులు, రాము, సుగుర్తిశంకర్, విజయ్ పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠించాలని ఎస్సై ఎస్‌కే హమీద్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో త్రైత సిద్ధాంత క్యాలెండర్‌ను నాయబ్ తహసీల్దార్ ఫణికిషోర్‌తో కలిసి ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు కొన్నె ఉపేందర్, అల్వాల రాజు, కానిస్టేబుళ్లు నర్సిరెడ్డి, రాకేష్, విద్యా, నాయకులు రామిని మదన్‌మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీతారామచంద్ర స్వామి ఆలయంలో..



జనగామ: జిల్లా కేంద్రంలోని హనుమత్ రామనాథ సహిత సీతారామచంద్రస్వామి దేవాలయంలో జ్యోతిష్య పండితులు డాక్టర్ ఎక్కలదేవి మోహనకృష్ణ భార్గవ రచించి ప్రచురించిన విశ్వావసు నామ సంవత్సర సత్సంప్రదాయక క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కందాడి మల్లారెడ్డి, జక్కా నర్సిరెడ్డి, పాశం శ్రీశైలం, యాదగిరి, ఝెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

ఆహ్వాన ప్రతుల..



రఘునాథపల్లి: మండల కేంద్రంలోని దొడ్డుగుట్టపై వెలసిన అయోధ్యరామస్వామి ఆలయ 106వ వార్షిక మహోత్సవ ఆహ్వాన ప్రతులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు శుక్రవారం ఆవిష్కరించారు. దేవస్థాన ధర్మకర్త నిర్వాహకులు పాశం నిరంజన్, ఆయన సోదరులు ఆహ్వాన కార్యక్రమం చేపట్టారు. ఏప్రిల్ 4న వైభవంగా ఆలయ వార్షికోత్స మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జీపీ కార్యదర్శి బాలకిషన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీరహనుమాన్ యాత్ర కరపత్రాల..

జనగామ రూరల్ : జిల్లా కేంద్రంలోని ధర్మశాలలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం వీర హనుమాన్ విజయయాత్ర కరపత్రాలు ఆవిష్కరించారు. ఏప్రిల్ 12వ తేదీన హనుమాన్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో యాత్ర నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ తెలిపారు. మోహనకృష్ణ భార్గవ, రంగ నర్సింహారావు, బాలనారాయణ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ అందజేత



చిల్పూరు: శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ నరేశ్‌గౌడ్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. పేదకుటుంబం కావడంతో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దం రాజు.. కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా వారికి విషయాన్ని తెలిపారు. వెంటనే వారు స్పందించి ఉపాధి పొందేందుకు మృతుడి భార్య భవానికి కుట్టుమిషన్ అందజేశారు. మండల అధ్యక్షుడు గణగోని రమేష్, కంకటి రాజన్న, బాల్నె వెంకటమల్లు, భైరి పవన్, తండ వెంకటేశ్వర్లు, కొయ్యడ రామదాసు, రంగు రమేష్, రంగు హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామ్‌చరణ్

జఫర్‌గఢ్: సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై రామ్‌చరణ్ అన్నారు. స్వర్ణ భారతి మండల సమైఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సైబర్ నేరాల నియంత్రణపై గ్రామైఖ్య సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎం రవీందర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎస్సై హాజరై మాట్లాడారు. సైబర్ నేరాలపై మహిళలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ నేరాలపై యాప్‌ల ద్వారా మహిళలకు వివరించారు. ఆర్‌ఎం నిర్మల, సీసీలు శ్రీనివాస్, సోమయ్య, రాధిక, ప్రవీణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన

పాలకుర్తి టౌన్: లింగ సమానత్వాన్ని సాధించేందుకు చైతన్యం కల్పించాలని మండల విద్యాధికారి పోతుగంటి నర్సయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడ, మగ సమానత్వం, సమాన అవకాశాలు, మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, ఆడపిల్ల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ హైమవతి, జెండర్ కమిటీ అనుముల అనూష, ఏపీఎం నరేందర్, సీసీ వెంకటేష్, వీఓఏలు రాపర్తి మంజుల,ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల ఆత్మగౌరవమే 'భూమాత' ధ్యేయం

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సమ్మయ్య


మాట్లాడుతున్న సమ్మయ్య

చిల్పూరు: రైతుల ఆత్మగౌరవం కోసం పనిచేసేదే భూమాత రైతు సంక్షేమ సంఘం అని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్య యాదవ్ అన్నారు. మండలంలోని వెంకటేశ్వరపల్లెలో శుక్రవారం భూమాత సంఘం మండల కార్యాలయంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాదం గట్టయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూభారతి చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని దీనివల్ల రైతులకు ఎంతో న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం చాలా గ్రామాల్లో సాగునీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఈ సీజన్‌లో సాగునీరు అందేలా చూడాలన్నారు. జిల్లా అధ్యక్షుడు దేవి తిరుపతిరెడ్డి, బానోత్ బాలరాజు, నారగోని పరమేశ్వర్, బోళ్ల రాజ్‌కుమార్, సాంబారి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవడంలో విఫలం


దేవరుప్పల: ఎండిపోయిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంమోహన్‌రెడ్డి

దేవరుప్పుల/కొడకండ్ల: కాంగ్రెస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యం వల్ల సరైన సమయంలో సాగునీరు విడుదల చేయకపోవడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్‌రెడ్డి అన్నారు. దేవరుప్పుల, కొడకండ్ల మండలాల్లోని కామారెడ్డిగూడెం, రామేశ్వరంలో నీరందక ఎండిన వరిపొలాలను పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వ్యవసాయం మీద అవగాహన లేకపోవడం వల్ల నియోజకవర్గంలో రైతాంగం తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వచ్చిందన్నారు. రైతులకు ఎకరాలకు రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా నాయకులు భాగాల నవీన్ రెడ్డి, పల్లె కుమార్, పులిగిల్ల ఉపేందర్, ధరావత్ శ్రీనివాస్, నర్సింహచారి, రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య పాలకవర్గం ఏర్పాటు


ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకవర్గం

రఘునాథపల్లి: నవభారతి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా కోమళ్ల గ్రామానికి చెందిన కాటుకురి వసంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య భవనంలో మండలంలోని 53 గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు సమావేశమై ముందుగా 15 మంది ఈసీ సభ్యులను ఎంపిక చేశారు. ఈసీ సభ్యులు మండల సమాఖ్య పాలకవర్గానికి ముగ్గురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిలో అధ్యక్షురాలిగా కోమళ్ల గ్రామానికి చెందిన కాటుకురి వసంత, కార్యదర్శిగా నిడిగొండకు చెందిన వాతల హైమావతి. కోశాధికారిగా వెల్ది గ్రామానికి చెందిన బి శ్యామలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీతో డీపీఎం ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన పాలకవర్గాన్ని అధికారులు, గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు అభినందించారు. కార్యక్రమంలో డీపీఎం రాజేంద్రప్రసాద్, ఏపీఎం సారయ్య, సీసీలు సూత్రపు సంపత్, ఎల్లస్వామి, రినావతి, భాగ్యలక్ష్మి, జంపయ్య, ఉమాదేవి, సరోజన, ఎంఎస్‌ఏ శివారెడ్డి, గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

'వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలి'


నిరసన తెలుపుతున్న ముస్లింలు

జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలని జామియా మసీద్ అధ్యక్షుడు మసీఉర్ రహమాన్ డిమాండ్ చేశారు. అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం జనగామలోని అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చేతులకు నల్లటి దట్టీలు కట్టుకుని నిరసన తెలిపారు. ముస్లింలు పాల్గొన్నారు.

అండర్‌పాస్ నిర్మించాలి

జనగామ రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద బైపాస్ రోడ్డులో అండర్ పాస్ నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్ కోరారు. శుక్రవారం ఆయన అండర్‌పాస్ నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు మద్దతు తెలిపి మాట్లాడారు. 63 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నరు. అండర్‌పాస్ నిర్మాణం కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లవ కుమార్, మండల కార్యదర్శి మామిడాల రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్య, సందీప్, రమేశ్, మానిత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

శివానందలహరి పారాయణం

జనగామ రూరల్: మాస శివరాత్రి సందర్భంగా పట్టణంలోని ఉమామహేశ్వర దేవాలయంలో శుక్రవారం మహిళలు శివానంద లహరి పారాయణం చేశారు. ప్రతి నెలలో వచ్చే ప్రతి పౌర్ణమి, అమావాస్య, మాస శివరాత్రి రోజున దేవాలయాల్లో శివానందలహరి పారాయణం మహిళలతో నిర్వహించడం జరుగుతుందని పూజారి గంగు సాంబమూర్తి తెలిపారు. కార్యక్రమంలో మహిళలు భక్తులు రామిని అనురాధ, శారద, కల్పన, మాధవి, వినోద, వాణి, నీరజ, మల్లీశ్వరి, వనజ, లక్ష్మీ, శారద పాల్గొన్నారు.

'మామునూరు ఏయిర్‌పోర్టుకు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి'

స్టేషన్‌ఘన్‌పూర్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న మామునూరు ఏయిర్ పోర్టుకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరును పెట్టాలని కురుమసంఘం మండల అధ్యక్షుడు ఒగ్గు రాజు డిమాండ్ చేశారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య జయంతిని ఏప్రిల్ 3వ తేదీన ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, మామునూరు ఏయిర్‌పోర్టుకు ఆ మహనీయుడి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కురుమలకు రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, కొమురవెల్లి, ఐనవోలు దేవస్థానాల చైర్మన్ పదవులు కురుమలకే కేటాయించాలని ఆయన కోరారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో కురుమలు చైతన్యం కావాలని, న్యాయమైన హక్కుల సాధనకు కురుమలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్య పోరాటాలు చేయాలని ఆయన కోరారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రఘునాథపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కెఎస్‌ఎస్ ఫంక్షన్‌హాల్‌లో రఘునాథపల్లి, లింగాలఘణపురం మండలాల ముస్లింలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసినితో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్లు ఎండీ మోహ్సిన్‌ముజ్తబా, పోతిరెడ్డి రవీందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

● ఎమ్మెల్యే పల్లా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్ : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, ఆర్డీఓ గోపిరామ్, తహసీల్దార్ హుస్సేన్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలు పవిత్రమైనవి

● ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు చేపట్టే ఉపవాస దీక్షలు ఎంతో పవిత్రమైనవని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బషారత్ గార్డెన్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల ముస్లింలకు ఏర్పాటు చేసిన దావత్ ఏ ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే యశ్వనిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విందులో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

దేవరుప్పుల: సమాజ హితం కోరే దిశలో అల్లా సూచనలను ఆచరిస్తూ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని మతగురువు ఇనాయిత్ రసూల్ సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని కామారెడ్డిగూడెం మైనార్టీసెల్ మండల ప్రతినిధులు గులాం రసూల్, జాకీర్ బ్రదర్స్ స్వగృహంలో రంజాన్ పురస్కరించుకుని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ముస్లిం సోదరులతోపాటు బంధు, మిత్రులకు దావత్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ ఆజీజ్, ముజీర్, యాకుబ్‌పాషా, ఖాజా, షబ్బీర్, ఖలీల్, పీఎసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి, కాంగ్రెస్ మండల నాయకులు అనిల్, యాకస్వామి, గణేష్, సజ్జన్, ఉమేష్ పాల్గొన్నారు.

'క్రీస్తుజ్యోతి'లో అవగాహన సదస్సు


ఆంజనేయులు సన్మానిస్తున్న విజయపాల్‌రెడి

జనగామ: వరల్డ్ ఇంజనీరింగ్ డే ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్‌ను పురస్కరించుకుని యశ్వంతాపూర్‌లోని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా)ఆధ్వర్యంలో అన్‌లీషింగ్ ద పవర్ ఆఫ్ ఇంజనీర్స్ టూ అడ్వాన్స్ ద సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిట్ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. సమాజానికి ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంతో అవసరమని, వారి పరిజ్ఞానం, సామాజిక ఎదుగుదలకు సోపానమని తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ చైర్మన్ డాక్టర్ రామచంద్రారెడ్డి, ఏవీ గిరిధర్, కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి,ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీజ, యాకూబ్, సంతోషకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

లారీ–వాటర్ ట్యాంకర్ ఢీ.. ఇద్దరికి గాయాలు

చిల్పూరు: నష్కల్ జాతీయ రహదారిలో శుక్రవారం మధ్యాహ్నం వాటర్ ట్యాంకర్‌ను లారీ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, 108 వాహన అంబులెన్స్ ఈఎంటీ హరికృష్ణ, పైలట్ రారిరెడ్డి అందించిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై ఉన్న పూల మొక్కలకు బొడ్డు రాజు వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు పోస్తున్నాడు. ఘన్‌పూర్ నుంచి హనుమకొండ వైపు వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో లారీ, ట్యాంకర్ నుజ్జునుజ్జయ్యాయి. ఘటనలో లారీ డ్రైవర్ షేక్ మన్సూరి, రాజుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా రెండు వాహనాలను రోడ్డుపక్కకు జరిపి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బచ్చన్నపేట: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఏఎస్సై ఎస్‌కే హమీద్ తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నక్కవాని గూడెం గ్రామానికి చెందిన పంబాల నాగరాజు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదు

కొడకండ్ల: ప్రతి ఉద్యోగికి పదవి వీరమణ తప్పదని డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ సుధీర్, రవిరాథోడ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సీహెచ్‌ఓ హన్మకొండ దయాకర్ పదవి వీరమణ సన్మాన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం దయాకర్‌ను అతిథులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. డాక్టర్లు విష్ణు, ప్రీతి, స్నేహలత, సిబ్బంది పాల్గొన్నారు.

'చర్య తీసుకోవాలి'

పాలకుర్తి: కష్టపడి ఇంటి నిర్మాణం కోసం స్థలం కొనుగోలు చేసిన గిరిజనులను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ నాయకులపై చర్య తీసుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకులు బానోత్ మహేందర్ నాయక్, ధరావత్ యాకుబ్ కోరారు. శుక్రవారం వారు మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 17 సంవత్సరాల క్రితం బమ్మెర పెద్ద తండాకు చెందిన బానోత్ చత్రునాయక్ 316 గజాల ఇంటి స్థలం కొనుగోలు చేస్తే ఏ సంబంధం లేని కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, పాలకుర్తి మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతరావు అతడిని దూషిస్తూ గొడవపు దిగడం సరికాదన్నారు. గిరిజనులను ఇబ్బంది పెడుతున్న వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని వారు కోరారు. సమావేశంలో ఛత్రు నాయక్, మహేందర్ నాయక్, ప్రవీణ్, అంజన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఆదర్శంగా నిలవాలి

దేవరుప్పుల: సామాజిక సేవాధృక్పథంతో యువత ఆదర్శంగా నిలువాలని ఎస్సై ఊర సృజన్‌కుమార్ సూచించారు. శుక్రవారం జనగామ–సూర్యాపేట రహదారిలో మరిపడిగ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ రవి

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ బహిరంగ సభను ఏప్రిల్ 12న స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహిస్తున్నామని, మాదిగలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని మాదిగల రాజకీయ ఐక్య వేదిక నాయకులు, మాజీ జెడ్పీటీసీలు మారపాక రవి, గుర్రం యాదగిరి, నాయకులు ఇల్లందుల సుదర్శన్, కనకం గణేష్ కోరారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో మాదిగల రాజకీయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీల ఏ,బీ,సీ,డీల వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా మంద కృష్ణ మాదిగ తనదైన శైలిలో ఉద్యమిస్తున్నారని, ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణకు మద్దతు ఇస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టడంలో మంద కృష్ణ కృషి విశేషంగా ఉందన్నారు. తాటికొండ సురేష్‌కుమార్, గండి యాదగిరి, గబ్బెట బుచ్చయ్య, రాజారపు యాదగిరి, బొడ్డు ప్రభుదాస్, కొత్తపల్లి బిక్షపతి, జీడి కోర్నెల్, సింగపురం నాగయ్య, మారెపల్లి ప్రసాద్, గుండె మల్లేష్, చిట్టిబాబు, పరశురాములు, మహేందర్, వెంకటస్వామి, రాములు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన ఈత చెట్లు



తరిగొప్పుల: కల్లు గీత కార్మికుల జీవనోపాధి కోసం హరితహారంలో భాగంగా ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని నాటిన ఈత చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. పోతారం గ్రామంలో కిష్టంరాజు కుంట గట్టు వెంబడి నాటిన సుమారు 30 ఈత చెట్లు గుర్తుతెలియని రైతులు తమ పంటలను నూర్పిడి చేసి చెత్తాచెదారాన్ని కాల్చివేయడంతో గాలి దుమారానికి ఈత చెట్లకు నిప్పు అంటుకుని మాడిపోయాయి. అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతోనే ఇలాంటి సంఘటన జరిగిందని కల్లు గీత కార్మికులు వాపోతున్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడాలి

● కేజీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి గోపి


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి గోపి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం గీతా కార్మికుల సంక్షేమానికి పాటు పడాలని, వారి సంక్షేమార్థం రూ. 5వేల కోట్ల నిధులు కేటాయించాలని కల్లు గీతా కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు యాదండ్ల పరందామ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గీతా కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలన్నారు. మండల కార్యదర్శి పోతుగంటి కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య, బండపల్లి శంకరయ్య, వెంకటయ్య, వెంకటేష్, బలరాములు, సిద్దులు, అంజయ్య, సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.